క్లుప్తంగా

మహిళా సాధికారతపై బాబు మాట్లాడడం హాస్యాస్పదం



నాగమణి

కాకినాడ రూరల్: మహిళా సాధికారత గురించి చంద్రబాబు మాట్లాడటం హాస్యాస్పదమని వైఎస్సార్ సీపీ ఉభయగోదావరి జిల్లాల మహిళా విభాగం జోనల్ ఇన్‌చార్జి జమ్మలమడక నాగమణి ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం ఆమె స్థానిక విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. మహిళా సాధికారత గురించి మాట్లాడే అర్హత చంద్రబాబుకు లేదన్నారు. సంక్షేమాన్ని, అభివృద్ధి ని రెండు కళ్ళుగా చేసుకుని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారన్నారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్, లోకేష్ అబద్ధాలను ప్రచారం చేస్తున్నారన్నారు. నామినేటెడ్ పోస్టుల్లో 50 శాతం మహిళలకు సీఎం జగన్ కేటాయించారన్నారు.

ఎంబీబీఎస్ విద్యార్థినికి ఆర్థిక సాయం



విద్యార్థికి చెక్కును అందజేస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా

కాకినాడ సిటీ: ప్రతిభ గల పేద విద్యార్థులకు సేవ్ ది పీపుల్ ఆర్గనైజేషన్ చేస్తున్న సేవలు అభినందనీయమని కలెక్టర్ కృతికా శుక్లా అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఎంబీబీఎస్ తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని చుండ్రు నవ్యశ్రీకి సంస్థ ఆధ్వర్యంలో రూ.60 వేలు ఫీజు నిమిత్తం చెక్కును అందించారు. కలెక్టర్ మాట్లాడుతూ సమాజ హితాన్ని కోరే ఇలాంటి సంస్థలకు చేయూతనందించాలని కోరారు. సంస్థ అధ్యక్షుడు సంకర సుధీర్, ట్రస్ట్ సభ్యులు, వికాస సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలి

కరప: అంటువ్యాధులు వ్యాప్తి చెందకుండా ఉండాలంటే ప్రతి శుక్రవారం గ్రామాల్లో డ్రైడే పాటించాలని ఈఓ పీఆర్డీ ఎస్‌వీ శ్రీనివాసరావు అన్నారు. కరప, గురజనాపల్లి, పెనుగుదురు, నడకుదురు తదితర గ్రామాల్లో శుక్రవారం ఆయన పర్యటించి గ్రామ కార్యదర్శులకు డ్రైడే గురించి వివరించి, క్రమం తప్పకుండా అమలుచేయాలన్నారు. గ్రామాల్లోని మంచినీటి పథకం ఓవర్‌హెడ్ ట్యాంకులను తప్పనిసరిగా శుభ్రం చేయించాలన్నారు. వైద్య, పంచాయతీ సిబ్బంది గ్రామాల్లోని ఇంటింటికీ వెళ్లి నీటినిల్వ లేకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇంటింటికీ తిరిగి నీటి నిల్వ ఉండే ప్రదేశాలు గుర్తించి, శుభ్రం చేయించాలని ఆయన సూచించారు. కార్యదర్శులు ఎస్‌కే నాగేంద్రకుమార్, బి.చంద్రకళ, పీఎస్ఆర్ బ్రహ్మానందం తదితరులు పాల్గొన్నారు.

పని భారాన్ని తగ్గించాలని ధర్నా

కాకినాడ సిటీ: మూడేళ్ల సర్వీస్ పూర్తి చేసిన హెల్త్ సెక్రటరీలకు పదోన్నతులు ఇవ్వాలని, 80 రకాల మొబైల్స్ యాప్స్ నుంచి పనిభారం తగ్గించాలని ఏపీ యునైటెడ్ గ్రామ, వార్డు హెల్త్ సెక్రటరీల వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు జి.బేబీరాణి, దువ్వా శేషుబాబ్జీ, చెక్కల రాజ్‌కుమార్ హాజరయ్యారు. అనంతరం జేసీ ఇలక్కియకు వినతిపత్రం అందించారు.

నేతాజీకి నివాళి

కాకినాడ రూరల్: నేతాజీ సుభాష్ చంద్రబోస్ వర్ధంతి సందర్భంగా రమణయ్యపేట 1వ డివిజన్‌లోని ఆయన విగ్రహం వద్ద వైద్యులు డాక్టర్ అడ్డాల సత్యనారాయణ, వెదురుపాక సతీష్ తదితరులు నివాళులర్పించారు. అలాగే బోట్‌క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో విశ్రాంత ఆర్మీ ఉద్యోగి శ్రీనగేష్, అడబాల రత్నప్రసాద్, రెడ్నం రాజా, చంద్రరావు, తదితరులు నివాళులర్పించారు.

ఘనంగా విజయలక్ష్మీ పండిట్ జయంతి

కాకినాడ రూరల్: స్వాతంత్ర్య సమరయోధురాలు విజయలక్ష్మీ పండిట్ జయంతిని సర్పవరం బోట్‌క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించి నివాళులు అర్పించారు. వాకర్స్ జిల్లా కో ఆర్డినేటర్ అడబాల రత్న ప్రసాద్, ఎస్.శ్రీ నగేష్ తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో పేలుడు

కాకినాడ క్రైం: కాకినాడ సూర్యనారాయణపురం, రంగయ్యనాయుడువీధిలో జీ ప్లస్ వన్ భవంతిలోని ఓ ఇంటిలో శుక్రవారం రాత్రి పేలుడు సంభవించింది. బాధిత కుటుంబ సభ్యులు గ్యాస్ సిలిండర్ వల్ల అని చెబుతున్నా అందుకు సంబంధించిన ఆధారాలు అధికారులకు లభ్యం కాలేదు. స్థానికుల సమాచారంతో అక్కడకు చేరుకుని చెలరేగిన మంటలను అదుపుచేసిన ఫైర్ అధికారులు అనుమానాస్పద పేలుడుగా తమ రికార్డుల్లో నమోదు చేసుకున్నారు. ఈ ఘటనలో 57 ఏళ్ల వృద్ధురాలితో పాటు 16 ఏళ్ల బాలుడు గాయపడ్డారు. వారిని జీజీహెచ్‌కు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జనసేన నాయకుల పర్యటన

కరప: మండలం వేములవాడలో రెండోరోజు శుక్రవారం కూడా జనసేన పీఏసీ సభ్యుడు, కాకినాడ రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జి పంతం నానాజీ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కల్సి పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

సర్కారువారి స్మార్ట్ స్కూల్స్

- రూ.32 కోట్లతో అత్యాధునిక వసతులు
- పెరిగిన ప్రమాణాలతో సీట్లకు గిరాకీ
- పలుచోట్ల 'నో-వేకెన్సీ' బోర్డులు



స్మార్ట్‌సిటీ నిధులతో అభివృద్ధి చేసిన శ్రీనగర్ పాఠశాల

కాకినాడ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో విద్యా వ్యవస్థను గాడిలో పెట్టేందుకు తీసుకున్న చర్యల ఫలితంగా నేడు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు గణనీయంగా మెరుగుపడ్డాయి. కాకినాడలో ఓ పక్క నాడు-నేడు, మరో వైపు స్మార్ట్ సిటీ నిధులను వెచ్చించి పాఠశాలలను అభివృద్ధి చేస్తున్నారు. నగరంలో 14 ఉన్నత పాఠశాలలు, 52 ప్రాథమిక పాఠశాలలు, ఒక యుపీస్కూల్ ప్రభుత్వ నిర్వహణలో కొనసాగుతున్నాయి. జిల్లా కేంద్రం కావడంతో ఇక్కడ సహజంగానే పెద్ద ఎత్తున ప్రైవేటు పాఠశాలలు ఉన్నత ప్రమాణాలతో పాఠశాలలను అందుబాటులోకి తెచ్చాయి.

కార్పొరేషన్ పాఠశాలలకు హంగులు

నవరత్నాలలో భాగంగా విద్యకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యమిస్తున్న నేపథ్యంలో కార్పొరేషన్ పరిధిలోని పాఠశాలలకు అత్యాధునిక హంగులు సమకూరుస్తున్నారు. ఉన్న పాఠశాలను ఆధునీకరించడంతో పాటు డిమాండ్‌కు అనుగుణంగా అదనపు తరగతి గదులను నిర్మాణం చేపట్టారు. ఈ పనులను రూ.26 కోట్లతో చేపట్టారు. దీంతో పాటు ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి చొరవతో సాధించిన స్మార్ట్‌సిటీ నిధుల నుంచి రూ.32 కోట్లు వెచ్చిస్తూ అవసరమైన చోట్ల 94 అదనపు తరగతి గదుల నిర్మాణం, మరుగుదొడ్లు, ఆర్వో ప్లాంట్లు, ఇతర వసతులు కల్పిస్తున్నారు. డిజిటల్ తరగతుల ఏర్పాటుకు కూడా చర్యలు తీసుకుంటున్నారు. నాలుగు ప్యాకేజీలలో రూ.32 కోట్లు వెచ్చించి పనులు వేగవంతం చేస్తున్నారు.

నో వేకెన్సీ బోర్డులు

కాకినాడలోని అనేక పాఠశాలల్లో నో వెకెన్సీ బోర్డులు దర్శనమిస్తున్నాయి. శ్రీనగర్, గొడారిగుంట, తిలక్ వీధి, శ్రీరామ్‌నగర్, సాలిపేట సహా అనేక పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పరిమితిని మించిపోయింది. దీంతో ప్రజాప్రతినిధులు, అధికారులు సిఫార్సులు కూడా తెచ్చుకుని ప్రభుత్వ పాఠశాలల చుట్టూ తిరిగే పరిస్థితి ఈ ఏడాది కనిపించింది.

ఏప్రిల్ నాటికి పనులు పూర్తి



స్మార్ట్‌సిటీ నిధులతో రూ.32 కోట్లు వెచ్చించి అనేక ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు కల్పిస్తున్నాం. వీటిలో సుమారు 27 పాఠశాలలు పూర్తయ్యాయి. మరికొన్ని పాఠశాలలు పునాది, శ్లాబ్, పూర్తి అయిన దశల్లో ఉన్నాయి. ఇవన్నీ వచ్చే ఏడాది ఏప్రిల్ నాటికి పూర్తి చేసి వినియోగంలోకి వచ్చేలా చర్యలు తీసుకుంటున్నాం. గతం కన్నా ఇప్పుడు ప్రభుత్వ పాఠశాలల్లో సీట్ల కోసం ఎక్కువ మంది పోటీ పడుతున్నారు.

– సీహెచ్ నాగనరసింహారావు, కమిషనర్, కాకినాడ నగరపాలక సంస్థ

వరాలమ్మకు సామూహిక వ్రతాలు

- కిటకిటలాడిన అమ్మవారి ఆలయాలు
- విశేష అలంకరణలో దేవతా మూర్తులు
- ఏర్పాట్లు చేసిన ఆలయ కమిటీలు



కరప విష్ణ్వాలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు చేస్తున్న మహిళలు

కరప: శ్రావణ మాసం మొదటి శుక్రవారం సందర్భంగా మండలంలోని అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. కరప దుర్గాదేవి ఆలయంలో అర్చకులు కొంపెల్ల చక్రధరరావు ఆధ్వర్యంలో పూజలు నిర్వహించగా, ఆలయకమిటీ సభ్యులు మేడిశెట్టి అప్పలస్వామి, పెద్దకాపు, నక్కా సత్యనారాయణ, వీరబాబు, తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. పెనుగుదురు సంతోషీమాత ఆలయంలో అర్చకులు కాదా సత్యనారాయణ అమ్మవారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. వేములవాడ, వేళంగి, అరట్లకట్ట, కొరిపల్లి, వలసపాకల, పాతర్లగడ్డ, గొర్రిపూడి, పెద్దాపురప్పాడు, యండమూరు, కూరాడ తదితర గ్రామాల్లోని దుర్గాదేవి ఆలయాలకు భక్తులు పోటెత్తారు.

ఘనంగా సామూహిక వరలక్ష్మీ వ్రతాలు

కరప: స్థానిక విష్ణాలయంలో శుక్రవారం దేవదాయశాఖ ఆధ్వర్యంలో అర్చకులు పెద్దింటి అనంతాచార్యులు, గోపాలకృష్ణ, సూర్యనారాయణలు రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామికి, అదే ప్రాంగణంలో ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి, అభయాంజనేయ స్వామివార్లకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామం నుంచి తరలివచ్చిన 200 మంది మహిళలు సామూహిక వరలక్ష్మీ వ్రతాలు చేశారు. దేవదాయశాఖ ఈఓ వడ్డాది సత్తిబాబు పర్యవేక్షణలో నిర్వహించిన సామూహిక వ్రతాల్లో భక్తులకు పూజా సామగ్రి అందజేశారు. భక్తులకు ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, వైఎస్సార్ సీపీ నాయకులు పెంకే సత్తిబాబు, సాదే లోహిదాస్ తదితరులు ప్రసాద వితరణ చేశారు.

బాలాత్రిపురసుందరికి భారీ సారె



అమ్మవారికి సమర్పించిన సారెతో సమితి సభ్యులు

బోట్‌క్లబ్: శ్రావణమాసం సందర్భంగా బాలాత్రిపురసుందరి సమేత రామలింగేశ్వరస్వామికి ఆ సేవాసమితి సభ్యులు శుక్రవారం భారీ సారె సమర్పించారు. ఒకొక్క రకానికి 108 కేజీల చొప్పున వివిధ రకాల స్వీట్లు సమర్పించారు. రామారావుపేట శివాలయం నుంచి ఊరేగింపుగా సారె తీసుకొచ్చారు. ఈవో చింతపల్లి విజయ్ భాస్కరరెడ్డి, గోదావరి చాంబర్ ఆఫ్ కామర్స్ చైర్మన్ పెద్ది రత్నాజీ, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

శ్రమదానంతో తాగునీటి బావి శుభ్రం




శుభ్రం చేసిన బావి నుంచి నీటిని తీసుకువెళ్తున్న మహిళలు

కరప: మండలం గొర్రిపూడిలోని పెద్దపుంత వీధి ప్రజలు శ్రమదానం చేసి మంచినీటి బావిని శుభ్రం చేసుకున్నారు. గొర్రిపూడి గ్రామానికి తాళ్లరేవు మండలం జి.వేమవరం సామూహిక రక్షిత నీటి పథకం నుంచి పైపులైన్ ద్వారా సరఫరా అవుతున్న నీరు బాగుండడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. పెద్దపుంత వీధిలో పూర్వకాలంలో నిర్మించిన బావిని రక్షిత పథకం వచ్చాక విస్మరించారు. తాజాగా పథకం నీరు బాగుండకపోవడంతో ఈ బావిలో నీటిని స్థానికులు పూర్తిగా తోడి పూడిక తొలగించారు. అనంతరం పూజలు చేసి పునర్వినియోగంలోకి తెచ్చుకున్నారు.

పరిశుభ్రతే ఆరోగ్యానికి ఆయుధం

- రిలయన్స్ ఇండస్ట్రీస్ సేవలు భేష్
- పాఠశాల విద్య ఆర్‌జేడీ నాగమణి



విద్యార్థినులకు కిట్లు పంపిణీ చేస్తున్న ఆర్‌జేడీ నాగమణి

కాకినాడ: పరిశుభ్రతను పాటించడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యంతో ఉండవచ్చునని పాఠశాల విద్య ఆర్‌జేడీ జి.నాగమణి పేర్కొన్నారు. స్థానిక దంటు కళాక్షేత్రంలో శుక్రవారం గాడిమొగ, భైరవపాలెం ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న కౌమార విద్యార్థులకు ఆరోగ్య అవగాహన, పరిశుభ్రత, ఋతుక్రమంలో తీసుకోవలసిన జాగ్రత్తలపై రిలయన్స్ ఇండస్ట్రీస్ సంస్థ అవగాహన సదస్సు నిర్వహించింది. సంస్థ సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా విద్య, వైద్య రంగాలకు చేస్తున్న సేవల్లో భాగంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆర్‌జేడీ మాట్లాడుతూ ఇటువంటి సదస్సుల వల్ల ఎంతో మేలు జరుగుతుందని, ప్రభుత్వం విద్యార్థులకు అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పడాల చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు హాజరై విద్యార్థులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. రిలయన్స్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ డి.రాజేష్, సీఎస్ఆర్ హెడ్ పి.సుబ్రహ్మణ్యం తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. అలాగే రిలయన్స్ లేడీస్ క్లబ్ సభ్యులు కూడా పాల్గొన్నారు. విద్యార్థినులకు కిట్లు పంపిణీ చేశారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు




వెండి గరుడ వాహనంపై స్వామి, అమ్మవార్లను ఊరేగిస్తున్న భక్తులు



నృత్య ప్రదర్శన చేస్తున్న చిన్నారులు

అన్నవరం: రత్నగిరిపై సత్యదేవుని 133వ సత్యవిదియ వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా రత్నగిరిపై చేసిన పుష్పాలంకరణ, సాంస్కృతిక ప్రదర్శనలు భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. సుమారు వంద మంది రుత్విక్కులు పూజలు, అభిషేకాలు, జపాలు, పారాయణలు తదితర వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. స్వామి, అమ్మవార్లను ఉదయం వెండి రథంపై, రాత్రి వెండి గరుడ వాహనంపై ఊరేగించారు. స్థానిక కావ్యశ్రీ నృత్యకళాశాలకు చెందిన చిన్నారులు చేసిన నృత్యప్రదర్శన భక్తులను అలరించింది. రంగురంగుల విద్యుత్ దీపాల నడుమ సత్యదేవుని ఆలయం కళకళ లాడింది.

బార్ అసోసియేషన్ లోగో ఆవిష్కరణ



బార్ అసోసియేషన్‌లో లోగోను ఆవిష్కరించిన న్యాయమూర్తులు, సభ్యులు

కాకినాడ లీగల్: కాకినాడ బార్ అసోసియేషన్ గత ఏడాదికి 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా మూడో అదనపు జిల్లా జడ్జి పి.కమలాదేవి లోగోను ఆవిష్కరించారు. శుక్రవారం స్థానిక బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.విశ్వేశ్వరరావు, కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో ఆమెతో పాటు న్యాయమూర్తి ఎం.హరినారాయణ, ఎల్.వెంకటేశ్వరరావు లోగోను ఆవిష్కరించారు. బార్ అసోసియేషన్ 1872లో స్థాపించారు. వచ్చేనెల 9న జరగబోయే జాతీయ లోకఅదాలత్‌లో అధిక కేసులు పరిష్కరించాలని కమలాదేవి కోరారు.

ప్రకృతిని పరిరక్షించాలి





గ్రామీణ జీవన విధానానికి అద్దం పట్టేలా తీసిన ఛాయాచిత్రం (అంతర చిత్రం) సోమయాజుల వెంకట అరుణ్‌కుమార్

కాకినాడ కల్చరల్: మదిని మురిపించే చిత్రాలు తీయడంలో ఫొటోగ్రాఫర్ సోమయాజుల వెంకట అరుణకుమార్‌ది ప్రత్యేక శైలి. పల్లె, గిరిజన జీవన విధానాలను, ప్రకృతిని తన కెమెరాలో బంధించడంలో మంచి నేర్పరి. జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ పురస్కారాలు ఎన్నో ఆయన పొందారు. ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా అభివృద్ధి పేరుతో ప్రకృతిని ఎవరూ పాడు చేయకుండా ఉండేలా ఆ అందాలను ఫొటో తీసి వాటి ఆవశ్యకతపై అవగాహన కల్పించేందుకు తన వంతు కృషి చేస్తున్నట్టు అరుణ్‌కుమార్ చెప్పారు.

కళాక్షేత్రం పనులు వేగవంతం చేయండి

- కమిషనర్ సీహెచ్ నాగ నరసింహారావు



కళాక్షేత్రం నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కమిషనర్ నాగ నరసింహారావు

కాకినాడ: రూ.20 కోట్లతో నిర్మిస్తున్న రాగిరెడ్డి వెంకట జయరామ్ కుమార్ కళాక్షేత్ర పనులను వేగవంతం చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగ నరసింహారావు ఆదేశించారు. శుక్రవారం ఆయన కళాక్షేత్ర నిర్మాణ పనులను పరిశీలించారు. పనులను నాణ్యతా ప్రమాణాలతో, వేగంగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని కాంట్రాక్టర్, అధికారులను ఆదేశించారు. సెప్టెంబర్ చివరి నాటికి వినియోగంలోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట కన్‌స్ట్రక్షన్స్ మేనేజర్ కామేష్, శ్రీ సూర్యరామ కన్‌స్ట్రక్షన్స్ ప్రతినిధులు ఉన్నారు.

కన్వర్టబుల్ స్టేడియం పనుల పరిశీలన

స్మార్ట్ సిటీ నిధులతో చేపట్టిన కన్వర్టబుల్ స్టేడియం నిర్మాణ పనులను కమిషనర్ నాగ నరసింహారావు పరిశీలించారు. రూ.8.20 కోట్లతో సురేష్‌నగర్‌లో దీనిని నిర్మిస్తున్నారు. 1200 సీట్ల సామర్థ్యంతో ఈ స్టేడియం నిర్మిస్తున్నట్టు ఆయన తెలిపారు. బాస్కెట్ బాల్, వాలీబాల్, త్రో బాల్, షటిల్ బ్యాడ్మింటన్ వంటి వివిధ పోటీల నిర్వహణకు వీలుగా స్టేడియం నిర్మిస్తున్నట్టు తెలిపారు.

పారిశుధ్య పనుల తనిఖీ

- ఇద్దరికి షోకాజ్ నోటీసులు

కాకినాడ: నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగ నరసింహారావు శుక్రవారం పారిశుధ్య పనులను తనిఖీ చేశారు. మూడో సర్కిల్ పరిధిలోని శాంతినగర్ ప్రాంతంలో పర్యటించి సిబ్బంది పర్యవేక్షణా లోపాన్ని గుర్తించారు. ఇందుకు బాధ్యులైన శానిటరీ సెక్రటరీ దడాల శ్రీను, మేస్త్రి శివకుమార్‌లకు షోకాజ్ నోటీస్ ఇవ్వాలని ఆదేశించారు. ఏ ప్రాంతంలోనైనా కార్మికులు రాని పక్షంలో తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు.

పద్మశ్రీ ప్రమాణ స్వీకారానికి తరలిన నేతలు



ఎమ్మెల్సీ పద్మశ్రీ ప్రమాణ స్వీకారానికి హాజరైన ఎమ్మెల్యేలు కురసాల కన్నబాబు, ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, నాయకులు, కార్యకర్తలు

కాకినాడ: ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ ప్రమాణస్వీకారానికి జిల్లా నలుమూలల నుంచి వైఎస్సార్‌సీపీ ప్రముఖులు పెద్ద ఎత్తున తరలివెళ్లి ఆమెను అభినందించారు. ప్రభుత్వ సలహాదారులు సజ్జల రామకృష్ణారెడ్డి, మంత్రి చెల్లుబోయిన వేణు, వైఎస్సార్ సీపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే కురసాల కన్నబాబు, కాకినాడ, పిఠాపురం ఎమ్మెల్యేలు ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, పెండెం దొరబాబు, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు, కొడ చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళా దీప్తి, వైఎస్సార్ సీపీ కాకినాడ నగరాధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, ఏఎంసీ ఛైర్మన్ పసుపులేటి వెంకటలక్ష్మి, కాకినాడ జిల్లా పార్టీ మహిళాధ్యక్షురాలు వర్ధినీడి సుజాత, మైనార్టీ నాయకులు రెహ్మాన్‌ఖాన్, బాషా తరలివెళ్లారు. ఈ సందర్భంగా వారంతా అసెంబ్లీ హాల్‌లోని అన్ని విభాగాలను సందర్శించి సెల్ఫీలు దిగారు. కాగా ఈ నెల 21న తలపెట్టిన అభినందన ర్యాలీ వాయిదా వేశామని, ఎప్పుడు నిర్వహించేదీ త్వరలో చెప్తామని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి చెప్పారు.

బందన హరికి కన్నీటి వీడ్కోలు



బందన హరి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న అభిమానులు

కాకినాడ: అనారోగ్యంతో మృతి చెందిన రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్, మత్స్యకార నాయకుడు బందన హరి (64)కి రేవు కార్మికులు, బార్జి యజమానులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కన్నీటి వీడ్కోలు పలికారు. సుమారు 40 ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్న హరి సౌమ్యునిగా, వివాదరహితునిగా పేరొందారు. ఆరంభంలో కాంగ్రెస్ సేవాదళ్ జిల్లా చైర్మన్‌గా పనిచేశారు. 2009లో పీఆర్‌పీ తరఫున శాసనసభకు పోటీ చేసి ఓటమి చెందారు. అనంతరం వైఎస్సార్ సీపీలో చేరిన ఆయన ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి చొరవతో అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ పదవి పొందారు. కొద్దిరోజులుగా అస్వస్థతతో బాధపడుతూ శుక్రవారం ప్రైవేటు ఆస్పత్రిలో తుదిశ్వాస విడిచారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఆయన కాకినాడ పోర్టు స్టీల్‌బార్జి ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కూడా కొనసాగుతున్నారు. తూరంగిలోని కైలాసభూమి శ్మశానవాటిక వరకు అంతిమ యాత్ర నిర్వహించారు.

ప్రముఖుల సంతాపం

బంధన హరికి ఎంపీ వంగా గీత, సిటీ, రూరల్ ఎమ్మెల్యేలు ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, కురసాల కన్నబాబు సంతాపం తెలిపారు. రాష్ట్ర రైసుమిల్లర్ల సంఘ అధ్యక్షుడు ద్వారంపూడి వీరభద్రారెడ్డి, కొడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్ సీపీ నాగరాధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, ఏఎంసీ చైర్మన్ పసుపులేటి వెంకటలక్ష్మి, కేంద్రమాజీ మంత్రి మల్లిపూడి పళ్లంరాజు తదితరులు నివాళులు అర్పించారు